ఆధునికత పేరుతో తను పెంచిపోషించిన చెట్టుని నరికేస్తాననే ప్రభుత్వాన్ని అతను ఎలా ఎదుర్కొన్నాడు?

కప్పగంతుల మల్లికార్జునరావు కథ

# రక్తకన్నీరు

ఎండ నిప్పులు చెరుగుతోంది.

అయినా సాంబయ్యకి వెన్నెల్లా ఉంది. వంచిన నడుం ఎత్తకుండా పొలంలో పనిచేస్తున్నాడు.

ఎదిగి కోతకు సిద్ధంగా వున్న పైరును చూస్తుంటే సాంబయ్యకు తృప్తి—ఆనందం! కడుపు నిండిన అనుభూతి!

మొన్నటిదాకా ఆ పైరు పచ్చగా కళకళలాడుతున్నది. ఈ వేళ పైరు తాను ఎండిపోయింది. కానీ మనిషికి తిండినివ్వటానికి సిద్ధంగా వుంది. పశువులకు మేతగా ఉపయోగపడటానికి తయారుగా వుంది.

అది ప్రకృతి సహజం!

కానీ మనిషి?

'ఏమయ్యా' కూడు తెచ్చా తిందువుగాని దా. అసలే పొద్దుపోయింది. చల్లటి వేపచెట్టు కింద నిలబడి అన్నం దుత్తను కందికి దించి, పైటకొంగుతో మొహం తుడుచుకొంటూ పెద్దగా అరిచింది శాంతమ్మ.

భార్య అరుపు విని సాంబయ్య తలెత్తి ఆకాశం వైపు చూచాడు.

నిజమే. పొద్దుపోయింది. బహుశా రెండు గంటలవుతున్నదేమో!

అప్పుడతనికి సూర్యుడి వేడిమి తెలిసింది తలగుడ్డ తీసి వంటికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు.

ఆకలి కూడా అప్పుడే అతనికి తెల్సింది. గబగబా అడుగులువేస్తూ చెట్టు దగ్గరికి వచ్చాడు.

'ఏంటే—యియ్యాల ఇంత ఆలిస్యం అయిందేం?'



'సెప్తానుగాని — ముందు నాలుగు ముద్దలు కడుపులో పడనియ్. కాళ్ళు సేతులు కడుక్కుని రా తొరగా'

బావిలో నీళ్ళతో కాళ్ళు చేతులు, మొహం కడుక్కోగానే అలసట క్షణంలో ఎగిరిపోయింది. చల్లటి నీళ్ళను రెండు దోసిళ్ళు తాగగానే ఆకలి ఎగిరిపోయినట్లయింది.

'ఏమయ్యోయ్ ఏంటది? నీళ్ళు తాగట ం మొదలుపెడ్తే నీకు వొళ్ళూపాయే తెలీదు. అట్టా నిళ్ళు తాగితే కూడేం. తింటావ్? సొల్లే—రారా'.

భార్య ముద్ద చేస్తుంటే దుత్తలో కూటిని క్షణంలో లాగేసేడతను.

'యిదిన్నావ' ఆ పరాజెక్టో ఏంటో అంటారే—అది మనూరు వస్తందంట. ఊర ంతా రకరకాలుగా చెప్పుకుంటున్నారు.

'అట్టాగా! మనూరు మునిగిపోతుందం టానా?'

'ఊహు! ఏటికవతలున్న నాలుగు గూడా లు మునిగిపోతాయంట!

'సీ! ఎదవనాయాళ్ళు' స్ఫురున లేచాడు సాంబయ్య.

బావి దగ్గరికెళ్ళి చెయ్యి కడుక్కొన్నాడు.

'అదేంటయ్యా! మద్దెలో లేసిపోయావ్? ఇంకా మజ్జిక్కూడా వుంది'

కానీ సాంబయ్య మాట్లాడలేదు. అతని చూపులు ఎక్కడో వున్నాయ్. మనసు మరెక్కడికో పోయింది.

కోట్ల రూపాయల ఖరీదు చేసే ఆ బహుళార్థ ప్రాజెక్టు ఎన్నో ఏళ్ళుగా కాగితాల లో నానుతోంది. రాజకీయాల మధ్య నలుగుతోంది.

ఆ ప్రాజెక్టు కట్టితే పంటలకు నీరొస్తుం ది. పరిశ్రమలకు విద్యుత్తు వస్తుంది. చాలా మంది వెంటనే లాభపడ్తారు. నిజమే.

కానీ అందువల్ల అటవీ సంపద నాశనమ వుతుంది. అడవుల్ని నమ్ముకొని జీవించే వన్యమృగాలు, పక్షులు దిక్కులేనివవుతాయి. అడవుల్ని నమ్ముకొని జీవించే అనేకమంది నిరాశ్రయులవుతారు. వాతావరణంలో బేలె న్స్ తప్పుతుంది. కాలుష్యం పెరగుతుంది. అందువల్ల దీర్ఘకాలంలో దేశమే నష్టపోతుంది

అందుకని కొందరు ప్రాజెక్టును వ్యతిరేకి ంచారు. ప్రకృతి రక్షణ ఉద్యమ నాయకులు నిరాహార దీక్షలు చేసేరు. వారికి అప్పట్లో అధికారం లేని రాజకీయ నాయకులు మద్ద తు నిచ్చారు. ప్రాజెక్టు ప్రపోజల్ ని 'కోల్డ్ స్టొరేజ్'లో పడేసేరు.

ఎన్నికల్లో అన్న మాటలు ఏమయ్యాయి. ప్రాజెక్టు నిర్మిస్తే లాభపడే పారిశ్రామికవేత్త లు, కాంట్రాక్టర్లు ఆర్థిక సహాయం అందిం చారు. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చారు.

అసలు ప్రపోజల్ ప్రకారం ఆ ఊరు మునిగిపోవాలి. కానీ ఆ ఊళ్ళో రాజకీయంగా శక్తివంతులయిన నాయకులున్నారు. అంచేత వారు, మొదట్లో అపోజిషన్ ముఠాలో చేరి ప్రాజెక్టును వ్యతిరేకించారు. కాని ఇప్పుడు ప్రభుత్వంతో కల్సిపోయి ప్రపోజల్ నే మార్చారు.

ఫలితంగా ఆ ఊరు మునిగిపోవటానికి బదులుగా అక్కడికి దగ్గరలో ఉన్న నాలుగు గూడేలు మునిగిపోబుతున్నాయి.

'ఆగూడెంలో జనం మనకన్నా దరిద్రులే. కొంపాగూడూ పోగుట్టుకొని ఎక్కడికి వెళ్తారు? ఎట్టా బతుకుతారంట?'

'గూడెం సంగతలా వుంచవయ్యా! ము ందు మన సంగతి సూడు. మనవూరి పక్కనుంచి కాలువలు తవ్వుతారంట! సాలా

మంది పొలాలు, కాలవల్లో కల్సిపోతాయంట!

'రెడ్డిగారి పొలాలు, నాయుడుగారి పొలాలు పోతాయంటావా?'

ఊరిపక్కన పొలాల్లో సగంకి పైగా వాళ్ళిద్దిరిదే. నిన్నటిదాకా వాళ్ళిద్దరూ బద్ధ శత్రువులు. మొన్నటి ఎన్నికల్లో మహానాయకుడి ఆదేశం పైన ఇద్దరూ ఏకం అయ్యారు. అందుకు ఫలితంగా ఇద్దరికీ చెరో పదవి లభించింది.

'ఏమో! నాకేం తెల్సు. పొలంపోయిన పెతిఫలంగా పెభుత్తం డబ్బు ఎక్కువయిస్తుందని సెప్తున్నారంటా వాళ్ళు'

'పిచ్చిదానా, మనదెంత పొలమే? ఈ కాత్తంత సెక్కేగా! అటుసూడు. ఆ బాటకు అటుపక్క పొలమంతా రెడ్డిగారిదేగా? ఇటుపక్క పొలమంత నాయుడుగారిదే కదా? పోతే ముందువాళ్ళ పొలం పోవాలి. కానీ బక్కోళ్ళం. ఈ కాస్తంత సెక్కను నమ్ముకొని బతుకుతున్నోళ్లం. మన పొలం ఎందుకు పోతుందే! ఎట్టాపోతుంది?' మనసులో ఎన్నో సందేహాలున్నా పైకి భార్యకి ధైర్యం చెప్తున్నట్లు అన్నాడు.

'ఎట్టంటేం— ఇక్కడ ఇంత పెద్దోరు, మనూరుండంగా, ఎక్కడో మూలనున్న గూడేలు మునిగి పోవటంలే—అట్టాగే. ఇంత పిచ్చి మారాజువేమయ్యా! నువ్వు?'

భార్య మాటలకి సాంబయ్య దిమ్మతిరిగి పోయాడు!

''ఊరందరిదీ ఒక దారైతే ఉలిపి కట్టేది మరోదారంట! అట్టా వుంది నీ యవ్వారం! నీ వొక్కడి పొలమేనా కాలువ కింద మునిగిపోతున్నది? సాలామంది పొలాలు పోతున్నాయి. వాళ్ళంతా నీలాగా మొండికేసు కూర్చున్నారా? పైగా పెభుత్తం నీ పొలాన్ని ఊరికే అడుగుతున్నదా! ఊరి పెద్దలు మంచివారు కనుక మన నాసి భూములకి వొకటికి రెండింతలు ఎక్కువరేటు ఇప్పిత్తున్నారు! అమ్మటానికి నీకేం దొబ్బుదాయంట! పెబుత్తం డబ్బులివ్వకుండా ఆక్రమించు



## విజయం ఖరీదు!

రామానందసాగర్ నిర్మిస్తున్న 'శ్రీకృష్ణ' సీరియల్‌ను మన టీవీ ప్రసారం చేయకపోయినా...దానికి ప్రేక్షకుల కరువు లేదు! ప్రపంచ వ్యాప్తంగా వున్న కృష్ణ భక్తులూ, దేవాలయాలు ఆయనకు నీరాజనాలు పడ్తున్నా ఈ సీరియల్ 50 దేశాలలో ప్రసారం అయ్యే అవకాశం ఉంది! బరోడాలో ఇప్పటికే 78భాగాల్ని రామానందసాగర్ నిర్మించాడు! విదేశీ విలేకరులకు ఇంటర్వ్యూ ఇవ్వడానికి కూడా సమయంలేక రామానందసాగర్ కష్టపడిపోతున్నాడట! బిబిసి ఈ మధ్యనే ఆయనతో ఇంటర్వ్యూ తీసుకుంది! అయితే ఈ హడావుడిలో ఆయన ఆరోగ్యాన్ని కూడా పాడుచేసుకున్నాడట! మొన్నీమధ్య డాక్టర్లు ఆయనను పరీక్షించి బెడ్‌రెస్ట్ తీసుకోమని సలహా ఇచ్చారట! అంటే విజయం ఖరీదు ఆరోగ్యమా?

—జూపిటర్

కొంటే మాత్తరం నువ్వేం సేత్తావంట! పెబుత్తోనికి ఆ అధికారాలున్నాయి. తెల్సా?

పూర్యం అన్నాడు. అతడిలో ఆవేశం మాటిమాటికీ పెరుగుతోంది.

కానీ సాంబయ్య ఉలకలేదు. పలకలేదు. కనీసం కళ్ళయినా తెర్చి కొడుకువైపు చూడ లేదు. ఎందుకంటే కొడుకు ఇప్పుడు పాడుతున్న పాట — రెవిన్యూ అధికారుల నోట, ఊరి నాయకుల నోట విని వినీ పాతపడినదే.

మొదట్లో గౌరితో వాదించాడు. తర్వాత బ్రతిమిలాడాడు. కన్నీళ్ళతో అర్థించాడు. నేను ఆవేశపడ్తున్నది, మీ కాళ్ళు పట్టుకొం టున్నది నాకోసం కాదు. మగ పెభువులారా అదిగో — ఆ అడవులకోసం, ఆ పెకుతి కోసం, సెట్లకోసం, ఆటి నీడన సల్లగా బతికే అడవి మురుగాల కోసం, పచ్చులకోస ం, నోరులేని మనుసులకోసం, పూర్వం సమయానికి వానలు కురిసేవి, ఎండలు ఎంత కాయాలో అంతే కాసేవి. ఇప్పుడో? వానదేముడికి కోపం వస్తున్నది. సూరీడుకు కోపం వస్తున్నది. గాలి దేముడికి కోపం వస్తున్నది. ఎందుకయ్యా? మనుసులం—మ నం పనుసుకోసం రాచ్చసులుగా మారంటం వల్ల! కనికరించడయ్యా నోరులేని ఆ వనదేవుళ్ళను పెకుతి దేముళ్ళను రచ్చించం డి. మనసులవాని పెంచుకోండి'

ఎవ్వరికీ అతని ఆవేదన గుండెల్లోకి ఎక్కలేదు.

అప్పుడు మొండికెత్తి తన నిర్ణయాన్ని ప్రకటించాడు.

'నేను ఆ అడవుల్ని కాపాడుకోలేను. అందులోని సెట్లను, సెట్ల మాటు పిట్టల్ని, పక్షుల్ని, జంతువుల్ని, మనుసుల్ని ఎవర్నీ కాపాడుకోలేను. కానీ ఇది నా భూమి, ఈ భూమిలో పెరిగిన ఈ సెట్టువాది. నా భూమిని కాపాడుకొంటా, నా సెట్టును కాపా డుకుంటా. ముందు నన్ను కొట్టేసి, నా సెట్టును కొట్టేయండి. నరగతం నాభూమి లో ఎదలైపారేక, నాభూమిలో మీకాలువల్ని తవ్వుకొండి, పోండి'

అతను తన పొలంలో చెట్టుకింద బైఠాయి ంచాడు.

ప్రాజెక్టువల్ల భూములు పోయే బక్కరై తులంతా అప్పటికే భూముల్ని ప్రభుత్వానికి స్వాధీనం చేసుకోవటానికి అంగీకరిస్తూ డా క్యుమెంట్ల మీద సంతకాలు చేసేరు. అందు కు రెడ్డిగారు; నాయుడుగారు కల్సి వాళ్ళను నయానా భయానా వొప్పించారు.

కానీ ఇప్పుడు సాంబయ్య తిరుగుబాటు వారిలో ఆశల్ని మళ్ళీ రేపింది.

ఈ ఊరి భూములన్నీ మెట్ట భూములు . ఇప్పుడు పెద్దగా ధరలు పలకని మాట నిజమే. కాని రేపు ప్రాజెక్టు వచ్చి మాగాణి భూములైతే ధరలు పెరిగిపోవూ?

ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చే ధనం ఖర్చయి పోతుంది. కానీ పోయిన భూమి మళ్ళీ తిరిగివస్తుందా? అందుకుగానూ—రెడ్డి, నా యుడు తమ పొలాలను సురక్షితంగా కాపాడు కొంటోండ్రు. కాలువల్ని వాళ్ళ భూముల నుంచి ఎందుకు తవ్వకూడదు? బక్క రైతుల భూముల్లో నుంచే కాలవ పోవాలని రూలేమన్నావుందా?

బక్కరైతులు ఇలా ఆలోచించటం ప్రమాదమా? పసిగట్టేరు, రెడ్డి, నాయుడు పథకం వేశారు. అక్కడికి దగ్గర్లో బస్తీలో ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటున్న సూర్యాన్ని పట్టుకొన్నారు. అతడిని పాచికగా సాంబయ్యమీదికి ప్రయోగించారు.

'ఏందయ్యా తమాసాగావుందా? నేనింత మొత్తుకుంటుంటే మాట్లడవేం? అట్టాగయితే నా నిరణయం కూడా ఇను. ఈ భూమిలో నాకూ భాగం వుంది గదా? నాభాగం నాకు పంచు.'

సాంబయ్య మెల్లగా కళ్ళు తెర్చాడు! కన్నీళ్ళు ఒక్కసారిగా పైకి చిమ్మేయి. కాని అవి వొట్టి కన్నీరు కాదు. రక్త కన్నీరు.

ముప్పయి ఏళ్ళ క్రితం—

అప్పుడు సాంబయ్య వయసు నలభై ఏళ్ళు

అతని భార్య ఇంట్లో ప్రసవవేదన పడ్తోంది.

ఆమె బాధ చూడలేక అతను పొలానికి వచ్చాడు.

అతని ప్రపంచమంతా ఇల్లూ—పొలమే.

ఊళ్ళో వ్యవహారాలు పట్టించుకోడు. రాజకీయాలకి ఆమడదూరం. మితభాషి. అంచేత పెద్ద మనిషిగా పేరుపొందాడు.

నిన్నమొన్నటి దాకా అతనికి బిడ్డల్లేరన్న కొరత వుండేది.


ఆ కొరత ఇప్పుడు తీరబోతుంది.

అతనికిప్పుడు చాలా ఆనందంగా ఉంది. ఆ ఆనందాన్ని పదిమందికి చెప్పుకోవచ్చు. పంచుకోవచ్చు. కానీ అంతటితో తృప్తి చెందే తత్వం కాదతనిది. ఈ శుభ సమయంలో ఏదో చెయ్యాలి. పదిమందికి పది కాలాలపాటూ ఉపయోగ పడే పని చేయాలి.

కానీ ఏం చేయాలి? ఎలాంటి పని చేయాలి?

'అన్నా, ఎండలో నడిచి అలసిపోయాం. నీ మంచెకింద కాస్సేపు తలదాచుకొంటాం. కాదనవుగా?

ఎవరో ఇద్దరు లంబాడీ స్త్రీలు. వారి



కౌగిళ్ళలో పసిబిడ్డలు. వెంట అయిదేళ్ళ వొక ఆడపిల్ల. అందరి మొహాలు బెట్ట దెబ్బకి వాడిపోయి వున్నాయి.

'అయ్యో ఎంతమాటమ్మా? రంద్రండి ...

అప్పటికప్పుడు ముళ్ళచెట్లు నరుక్కొచ్చి దడిగా కట్టి వారికి మరింత నీడ వచ్చే ఏర్పాటు చేసేదు. గడ్డిగాదం వేసి బిడ్డల్ని పదుకోబెట్టడానికి మెత్తలు ఏర్పాటు చేశాదు.

'అన్నా, బిడ్డకి దప్పికేస్తున్నదంట, ఈడ తాగటానికి మంచినీరు దొరకదా?'

సాంబయ్యగుండె గుభేలుమంది. అతను ఇంటినుంచి తెచ్చుకున్న నీళ్ళన్నీ అప్పటికే తాగేశాదు. ఆ పొలాల్లో ఒక్క బావన్నా లేదు. నీళ్ళు కావాలంటే మళ్ళీ వూళ్ళోకి పోవాలి.

'ఇప్పుడే పెవెంలో తెత్తానమ్మా'— అతమ ఊరువైపు పరుగుతీశాదు.

అక్కడికి కాస్తంత దూరంలో ఎగువున పెద్దనది వుంది. నదికి అటువైపు మహారణ్యాముంది. కానీ ఇటువైపు రాళ్ళు, రప్పలూ, తుప్పలూ, పుట్టలూ నీళ్ళ చుక్క కనిపించదు. బావులే శరణ్యం.

అక్కడి ప్రజలు, ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసి, వాణిజ్య పంటలు పండించి ఏదో విధంగా డబ్బు సంపాదించటం నేర్చుకొన్నారు. కాని చెట్లు పెంచుదామన్న ఆలోచన ఒక్కరికీ లేదు. పైగా, ప్రకృతి సహజంగానో, పక్షుల రెట్టల సాయంతోనో, ఎక్కడైనా ఒక వేపచెట్టు, రావి చెట్టు, మర్రి చెట్టు మొక్కలు మొలిస్తే వాటిని పీకి పారేస్తారు. అవి పెరిగి పెద్దవయితే పొలానికి అడ్డం రావూ? అవి పెరిగే స్థలంలో పంట నష్టం కాదూ?

అతమ తీసుకువచ్చిన నీళ్ళు తాగి సేదతీర్చుకున్నారు. లంబాడీ స్త్రీలు, పిల్లలు, కాస్త ఎండ తగ్గుమొహం పట్టగానే తమ దోవన తాము వెళ్ళిపోయారు.

ఆ క్షణంలో అతనో నిర్ణయాని కొచ్చాదు

ఆ ప్రాంతమంతా గాలించి ఎక్కడో ఓ చిన్న వేప మొక్కను పట్టుకున్నాదు.

లంబాడీ స్త్రీలు తాగగా మిగిలిపోయిన నీటితో, భూమిలోకి దిగిపోయిన ఆ మొక్క వేళ్ళను తడిపాదు.

'సాంబయ్యా నీకు మగపిల్లాదు పుట్టేడంటరా. ఇంటికెళ్ళకుండా ఈడేం సేత్తున్నావ్? అదేంట్రా— పనిగట్టుకొని వేపమొక్కని సేన్లో నాటుతున్నావ్?

పుట్టిన ఈ మొక్కకూడా నా బిడ్డే బాబాయ్. ఈ చేనులో నాకు ఇద్దరూ బిడ్డలు పుట్టేరు. ఇంట్లో పుట్టిన బిడ్డ పేరు సూర్యం. వాదు సూర్యుడిలా ఎదిగిపోవాలి. పొలంలో పుట్టిన బిడ్డ సెంద్రం. ఎండాకాలంలో కూడా వా సెంద్రం అందరికీ పల్లని నీడ నిత్తాదు బాబాయ్'.

ఎరువులు వేయాల్సిన అవసరం లేకుండానే వేపచెట్టు ఏపుగా ఎదుగుతోంది. చీడ పీడలు లేవు. పైగా వేపచెట్టు గాలి సోకేనేమో, చుట్టుప్రక్కల పొలాల పైర్లకు చీడపీడల బాధ తగ్గింది. కిందపడ్డ వేపగింజలు భూమిలో కల్సిపోయి ఎరువుగా పారటం వల్లనేమో, సాంబయ్య పొలం అధిక దిగుబడి

నిస్తోంది.

వేపచెట్టు కొమ్మలు బాటవైపు విస్తరించే లా మాత్రం జాగ్రత్తలు తీసుకున్నాడు సాంబయ్య. అంతకుమించి ఏం శ్రద్ధ తీసుకో లేదు. ఆ అవసరం లేకపోయింది.

కానీ సూర్యం ఎదుగుదలకు అతనెన్నో శ్రద్ధలు తీసుకున్నాడు. మంచి ఆహారాన్నిచ్చా డు. బట్టల నిచ్చాడు. ఫలితంగా సూర్యం కూడా శారీరకంగా బాగావే ఎదిగాడు.

అయితే మనిషి చెట్టుకాదు — రాయి రప్ప కాదుగదా? అతనికి బుద్ధివుంది. ఆలోచనా జ్ఞానం వుంది. మనసు వుంది. అనుభూతులున్నాయి.

కొడుకు బుద్ధి వికసింపచేసి మంచి ఆలోచనలు చేసే మనిషిగా తీర్చిదిద్దటానికి అవసరమైన అన్నిచర్యలూ తీసుకొన్నాడు సాంబయ్య. అతని మనసు మంచి మంచి అనుభూతులను స్వీకరించే అవకాశాలు కల్పి ంచాడు.

అయితే సూర్యం మనసు వాటిని స్వీకరించలేదు. అతని మనసుకు చీడ పట్టింది. అతని బుద్ధి పుచ్చిపోయింది. ఫలితంగా వంకర్లు తిరిగింది.

వేపచెట్టు తాను ఎదిగేకొద్దీ తన కిందికి వచ్చినవాళ్ళకి అధికంగా చల్లటినీడ నివ్వసాగి ంది. పదిమందికి పలురకాలుగా ఉపయోగప డసాగింది.

కానీ సూర్యం ఎదిగే కొద్దీ, తనని నమ్ముకొన్న తల్లితండ్రులకే భారమయ్యా డు. పదిమందినీ తన స్వార్థానికి ఉపయోగిం చుకోసాగాడు.

అతనికి చదువు అబ్బలేదు. కానీ తను ఓ గొప్ప మేధావినన్న అహంమాత్రం పెరిగింది . తనమాట అంతా వినాలి. వినకపోతే కోపం. ఆ కోపంతో ఏమన్నాచేస్తాడు. అతడిని పొలంపనిలో పెట్టాలని ఎంతో ప్రయత్నించాడు సాంబయ్య. 'నాకీ మురికి పనులంటే అసయ్యం' తెగేసి చెప్పేడు.

'మురికా? మట్టికి మురిక్కి భేదం తెలియకపోతే ఎట్టారా? నేల, నీరు, నిప్పు,



# పరిశీలన!

స్టెతస్కోప్‌తో ఒకామెని సీరియస్‌గా పరీక్షిస్తున్న డాక్టర్ మన్మధరావుని మరింత సీరియస్‌గా అడిగాడు—అప్పటికి గంటనుం చి ఎదురుచూస్తున్న గోవిందం "ఆమెనింకా ఎన్నిగంటలు చెక్‌చేస్తారు ?"

"స్త్రీ హృదయం చాలా లోతు. అర్థం చేసుకోవడం కష్టం. అందుకే ఇంత సేపు పరిశీలిస్తున్నా..."

"...?!?"

—పోలిశెట్టి రఘు (వడ్లమూరు)

ఎలుగు, ఆకాశం ఇవి శుద్ధమైనవిరా. వాటికి మురికి అంటదు. మనమే వాటికి మురికిని అంటిస్తున్నాం'.

'అసలు నాకీ పల్లెటూళ్ళంటేనే అసహ్యం. పట్టణం ఎల్లి దర్జాగా బుతుకుతా' అంటూ వెళ్ళిపోయాడు.

కొంతకాలం అతని జాడలేదు. ఆ తర్వాత వారానికి పదిరోజులకే వచ్చి డబ్బు ఇమ్మని వేధించాడు.

పెళ్ళి చేస్తే బాగుపడ్తాడని ఆ ప్రయత్నమూ చేసాదు సాంబయ్య.

'పెళ్ళా! నాకు! ఇక్కడ! మన పర్సనాలిటీకి సరిపొయ్యే పిల్ల మీకేడ దొరుకుతుంది? నేనే ఎతికి పట్టుకొంటాలే'.

వెతికి పట్టుకోటమే కాదు. ఏకంగా పెళ్ళి చేసుకొనే ఇంటికి తీసుకొచ్చాదు.

తీరా చూస్తే ఆ పిల్ల ఒక తాటకి. వయసులోనే కాదు పొగరులో, దుర్గుణాలలో అతనికంటే రెండాకులు ఎక్కువ చదివిన మనిషి.

'దానయ్యకు పట్టణంలో ఎంత పేరుందో తెల్సా? పోలీసోళ్ళకికూడా ఆయనంటే హడల్. పెద్దపెద్దోళ్ళందర్తో పరిసెయ్యాలున్నాయి. మనూరి రెడ్డిగోరు, నాయుడుగోరు కూడా ఆయనకి తెలుసు. ఆయన రికమండేసన్‌సేసి నాకు ఉద్దోగం వేయించాడు—' గొప్పగా చెప్పుకున్నాడు.

'ఏ ముద్దోగం?' సాంబయ్య ఆత్రంగా అడిగాడు. సూర్యం మాట్లాడలేదు.

''పోనీ— మీ మామగోరంత గొప్పోదు, కదా? ఆయనేం సేత్తుంటాడో తెలుసా''

రెండు ప్రశ్నలకీ సూర్యం భార్యే సమాధానం చెప్పింది.

'మా అయ్య పట్టణంలో పేరు మోసిన రౌడీ. ఆయనకు ప్రదయవోరు ఉజ్జోగం ఏయించారు. ముందు ముందు తనంతటోడిని సేత్తనన్నాడు తెల్సా?' గర్వంగా అంది తాటకి.

* * *

''ఆడు కొడుక్కాదయ్యా, కొరివి. అయినా ఆ ముదనష్టపు ఎదవతో పెట్టుకొంటే నష్టపోయేది ఎవరయ్యా! మనమేగందా? సిగ్గు ఎగ్గు మానం మరియాద అన్నీ వదిలేసుకొన్న ఆడికేం? ఉన్నదే కాత్తంత సెక్క. ఆ సెక్కలో ఆడు సగం పంచుకొన్నాడే అనుకో, దాన్ని ఆడేం సేత్తాడు? సాగు సేత్తాడా? పెటుత్తాని కిచ్చేసి డబ్బు తీసికెళ్ళి జల్సా చేసుకొంటాడు. అప్పుడు మిగిలిన సెక్కను నువ్వేం సేత్తావయ్యా? మన ఇంటి బాగోతం సూసి ఊరంతా నవ్వుకోరూ. ఇంటిగుట్టు రచ్చకెక్కించుకోటం తప్ప ఏం బావుంది సెప్పు? ఆ భూమి నీది కాదనుకొని గవర్నమెంటోడి కియ్యటానికి వొప్పుకోవయ్యా'.

'ఏడుపు ఈ భూమికోసం కాదే! నా సెంద్రంకోసం. ఆ సెట్టుకోసం. కన్నకొడుకు ఇట్టాగయ్యాదు. పెంచిన సెట్టు ఎట్టా ఎక్కొచ్చిందో సూడవే. ఈ సెట్టు కింద సొంతసేత్తో తవ్విన బావిని సూడవే. అవి మన బిడ్డలే. సెడిపోయిన ఆ ఎదవనే వదులుకోవటానికి మన మనసు గిల గిలాడి పోతున్నది. ఇక అందరికీ పనికొచ్చే ఈ బిడ్డల్ని ఎలా వదలుకోనే'.

నీడనిచ్చే చెట్టుకింద నీరు నిచ్చే బావి

వుంటే పదిమందికి మరింత వుపయోగమని ఆలోచించాడు సాంబయ్య.

సెట్టుకి ప్రక్కగా పొలం గట్టుకు ఆనుకొని బావి తవ్వాలని నిర్ణయించుకున్నాడు.

బావిని సగం తవ్వించాక ఎవ్వరికీ చెప్పలేదు. ఎవ్వరూ అతను చేస్తున్న పనిని గుర్తించలేదు.

'ఏంట్రా సాంబయ్యా. బావి తవ్వుదాం అనిపిస్తే మేము సాయం సెయ్యక పోయామా? పదిమందికి పనికొచ్చే బావికి నువ్వొక్కడివే కష్టపడటం ఎందుకంట?' అంటూ అప్పుడు తలోఒక చెయ్యేశారు.

అదృష్టంకొద్దీ అక్కడ మంచినీరు పడింది.

బాటసారులనేకాక ఈ చుట్టుప్రక్కల పొలాల్లో పనిచేసే కూలీవాలీక్కూడా ఆ బావి, చెట్టు ఉపయోగపడ్డాయి.

'సెట్టుని కొట్టేయటమంటే ఎంటో తెల్సా? మనిసి తనగొంతు తానే నరుక్కోటన్నమాట? నువ్వన్నట్లు భూమిచ్చేస్తాను కానీ, ఈ సెట్టుని, బావిని వదిలేసి కాలువను తవ్వుకోమని ఆళ్ళకి చెప్పవే'.

'అట్టాగేనయ్యా...'

బక్కరైతుల భూముల్ని స్వాధీనం చేసుకొనటం పూర్తయింది. యుద్ధ ప్రాతిపదిక మీద కాలువలు తవ్వేపని ఆరంభ మయింది. పెద్దపెద్ద లారీలు, బుల్ డోజర్లు, ఇంకా ఏవేవో పరికరాలు దిగాయి. ఎక్కడినుంచో తోలుకొచ్చిన కూలీలు పిల్లా పాపల్తో చెట్లకింద కాపురాలు పెట్టారు.

ఒకవైపు బుల్‌డోజర్ నేలను చదును చేస్తోంది. ఆ వెనుకనుండి చీమలబారులాంటి కూలీలు కాలువల్ని తవ్వుతున్నారు.

నిన్నటిదాక అవి పంటభూములు. ఈ వాళ వాటిరూపం రకరకాలుగా క్షణం క్షణం మారిపోతుంది.

ఊరివాళ్ళు ఆ ఆర్భాటాన్ని, ఆ స్పీడును చూచి విస్తుపోతున్నారు.

కూలీపని అయినా దొరుకుతుందని



## కుళ్ళిన విద్యారంగం

ప్రస్తుతం మన దేశంలో విద్యారంగం మనం ఊహించలేనంతగా దిగజారిపోయింది! ఇందుకు ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు! బీహార్‌ని 'కెఎస్‌డి' సంస్కృత విశ్వవిద్యాలయంలో—ఎమ్.ఎ సంస్కృతం చదివినవాళ్ళు ఇంగ్లీషును బోధిస్తున్నారని ఈ మధ్య విశ్వవిద్యాలయ రికార్డుల్ని ఆడిట్ చేసిన అధికార్లు కనుగొన్నారు! ఇలా అర్హతలేని వాళ్ళని లెక్చరర్లుగా నియమించిన ఘనత లాలూ ప్రసాద్ యాదవ్‌గారిది కాదట! అంతకుముందు పదవిలో ఉన్న ముఖ్యమంత్రిగారిలా చేసారని లాలూగారి వాదన! మరి లాలూగారే...ఇలాటి అవకతవకల్ని సరిదిద్దితేపోలా!

—జూపిటర్

ఆశించిన వ్యవసాయ కూలీలు నోళ్ళు వెళ్ళబెట్టారు.

'సాంబయ్యా, నీ సెట్టు సెంద్రాన్ని, బావిని వదిలేత్తారని సెప్పేవుగందా? ఆటిని సదులుసేత్తారంట.

'ఆటిని తాకమని నాకు మాట ఇచ్చారు గందా?'

'గవర్నమెంటోడి మాటలకి రూలు ఏముంది? కాగితం మీద రాసియ్యలేదు గందా?

'కానీ రెడ్డిగోరూ, నాయుడుగారు లేరు? ఆళ్ళు మాట తప్పుతారా?'

కానీ వాళ్ళు అందంగా తప్పించుకున్నారు.

'మేము అదే విచారిస్తున్నాం. మనకు మాటిచ్చిన ఆఫీసరుగారు బదిలీ అయిపోయి నారంట' నీకు నీ చెట్టుమీద, బావి మీద ఎంత ప్రేమో మాకుమాత్రం తెలీదా? కానీ ఇప్పుడేం చేయగలం చెప్పు. అంతా ప్రభుత్వ అధికారుల చేతుల్లో ఉంది'.

వారి దగ్గరికి వెళ్ళేడు సాంబయ్య.

కింది అధికారి పైఅధికారిని, పై అధికారి ఇంకా పైఅధికారిని... అలా అంచెలంచలుగా అడగమని చెప్పేరు. అదంతా వో పద్మవ్యూహంలా కన్పించింది. చివరికి అసలు అధికారి హైదరాబాద్ వెళ్ళాడని, వారందాకా రాడని తేల్చారు.

మళ్ళీ రెడ్డి, నాయుడుల దగ్గరికి వచ్చి మొరపెట్టుకున్నాడు.

'నువ్వే చూచావుగా సాంబయ్య. ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఇలాగే ఉంటాయి. మేమేం చెయ్యగలం... కావాలంటే ఆ చెట్టు ఖరీదెంతో చెప్పు ఆ డబ్బు మేమే ఇస్తాం'.

'ఛీ...'

తరతరాలుగా బలవంతులు బలహీనుల పై సాగిస్తున్న దోపిడీ విధానంపై అంతులేని అసహ్యానికి గుర్తు — ఆ ఒక్క అక్షరం ముక్క!

మర్నాడు ఉదయం.

బుల్‌డోజర్ తన పనివి ప్రారంభించింది.

ఊళ్ళో జనం చాలామంది అక్కడికే చేరారు. ఎవ్వరి దృష్టి బుల్‌డోజర్ మీద లేదు. చెట్టు మీద వుంది.

శాఖోపశాఖలుగా విస్తరించిన పెద్ద చెట్టు అది. ఆ చెట్టు మీద ఎన్నో పక్షులు గూళ్ళు కట్టుకొని నివసిస్తున్నాయి. ఆ గూళ్ళల్లో ఇప్పుడు చిన్న పక్షులువున్నాయి. చెట్టు రక్షణలో వాటినుంచి, పెద్ద పక్షులు పొద్దునే ఆహార అన్వేషణకి ఆకాశంలోకి ఎగిరిపోయాయి.

పచ్చటి చెట్లు ఆకులు, రెమ్మలు... ఆనందంతో గాలికి తలవూపుతున్నట్లున్నాయి. చెట్టు మొదలు కౌగిలించుకొన్నట్లు బోర్లాపడుకుని వున్నాడు సాంబయ్య. నేలమ చదును చేయిస్తున్న ఆఫీసర్ హుటాహుటీ అతని దగ్గరికొచ్చారు.

'ఎవరయ్యా నువు! బుల్‌డోజర్ చదుమ చేయటం కనపడటంలా? ఆ బుల్‌డోజర్ కిందపడితే మువ్వు చస్తావు లే.'

'లేవను నన్ను ముందు సంపి నా చెట్టును కొట్టేయండి. నా కిచ్చిన మాటన్న నిలబెట్టుకోండి. లేకపోతే నన్ను మీ బుల్‌డోజర్‌కి బలైనా చేయండి. అంతేకాని నా కళ్ళముందు నా సెంద్రాన్ని నాశనం సేత్తే మాత్తరం నేనూరుకోను.

ఆ ఆఫీసర్‌కి చెమటలు పోసాయి. పై ఆఫీసర్ దగ్గరికి పరిగెత్తాడు. నిముషంలో అధికారులందరికీ తెల్సిపోయింది. అంతా అక్కడికి చేరారు. ఎన్నో విధాల సాంబయ్యకి నచ్చచేప్ప ప్రయత్నం చేసారు.

'ఈ భూమి నాది, ఈ సెట్టు నాది, సెట్టును కొట్టేయనంటే భూమి మీకిచ్చాను . నన్ను మోసం సేత్తారా? ఏం? ఆ కాలవేదో ఆ రెడ్డిగోరి పొలంనుంచి తవ్వుకో కూడదా? సెట్టంటే ఎందుకయ్యా నీకంత కచ్చ? ఈ అన్నేయాన్ని నేను సహించను. నా సెట్టును నేను కాపాడుకొని తీర్తాను. ఏం సేత్తారో సేసుకోండి. తెగేసి చెప్పాడు సాంబయ్య.

ఈలోగా భూమినంతా చదునుగా చేసు కుంటూ వచ్చి, బుల్‌డోజర్ చెట్టుదగ్గర ఆగింది. ఆ రోజుకు పని ఆగిపోయింది.

తెల్లవారేసరికి మరింత జనం అక్కడకు పోగయ్యారు.

'సాంబయ్యగారూ, మేము ప్రభుత్వాధి కారులం ప్రభుత్వం చెయ్యమన్న పనిని చేయాల్సిన బాధ్యతగలవారం. నిమిత్త మాత్రులం. ఒక్క చెట్టు కోసం మీరిలా మొండికెయ్యటం బాగాలేదు. కావాలంటే ప్రభుత్వానికి అర్జీ పెట్టుకోండి. ప్లీజ్. మాతో సహకరించండి!


సాంబయ్య మాట్లడలేదు. నీరసంతో సన్నగా మూలుగుతున్నాడు.

నలుగురు మనుష్యులు అతడిని బలవంత ంగా అక్కడినుంచి ఎత్తేయాలని ప్రయత్నిం చారు.

పులిలామారి వాళ్ళను కుమ్మేడు. ఇంత లో జనం సాంబయ్యకు మద్దతుగా వచ్చారు.

చాతనయితే అతనికి నచ్చసెప్పండి. లేకపోతే రూల్ ప్రకారం మీ పని మీరు చేసుకోండి. అంతేకాని అతడిని బలవంతం గా ఏదైనా చేస్తే మేం ఊరుకోం.

మధ్యాహ్నం అయింది. ఆఫీసర్లు, వాళ్ళ



సిబ్బంది అంతా అక్కడినుంచి వెళ్ళిపోయారు.

ఆకలేసిన జనంకూడా కాస్సేపటికి ఇళ్ళకి వెళ్ళారు.

అప్పుడు హఠాత్తుగా ఒక అధికారి సాంబయ్య దగ్గరికి వచ్చాడు.

'సాంబయ్యగారు. ఆఖరి వార్నింగ్—అంటే హెచ్చరిక! బుల్ డోజర్ స్టార్టవబోతున్నది చెట్టు దగ్గరనుంచి ఇకనైనా లేవండి.'

'లేవను.'

'ఆల్ రైట్ నా పనిని నేను చేస్తాను. ఇంక మీకొక్క నిముషం వ్యవధి వుంది.' ఆ నిముషం అయిపోయింది.

బుల్ డోజర్ సాంబయ్య పడుకొని వున్న వైపునుంచికాక పక్కనుంచి స్టార్ట్ అయ్యింది. సంస్కృతి విలువలెన్నింటినో చదును చేస్తున్న నవీనభౌతికనాగరికతలాగా వుందా బుల్ డోజర్.

చెట్టును మరింతగా వాటేసుకున్నాడు సాంబయ్య.

భూతంలాగా బుల్ డోజర్ చెట్టును గుద్దేసింది.

పెరగటానికి ఎన్నో ఏళ్ళు పట్టిన అంత పెద్ద చెట్టు ఒక్క క్షణంలో తెగింది. కిందికి వొరిగింది.

చెట్టుతోపాటు సాంబయ్య కూడా కిందికి వొరిగేవాడే. చెట్టుకింద పడి నలిగేవాడే!

కానీ చెట్టు అతడిని రక్షించింది. బల్ డోజర్ దెబ్బను తాను తిని సాంబయ్యను అవతలికి నెట్టేసింది.

ఆ ఊపుకి సాంబయ్య అల్లంత ఎత్తున గాలిలో ఎగిరాడు. బుల్ డోజర్ కు దూరంగా మెత్తటి మట్టిలో పడబోతున్నాడు.

అలా పడ్తూ వుండగా అతని దృష్టి బుల్ డోజర్ డ్రయివింగ్ సీటులో వున్న వ్యక్తిపైన పడింది.

అతడు... అతడు...

సూర్యం! తనకొడుకు!

అరక్షణంలో ఆవగింజంత వ్యవధిలో అతనికి ఎన్నో విషయాలు అర్థమయ్యాయి.

తమ స్వార్థంకోసం కోట్ల డబ్బుకోసం తల్లిలాంటి ప్రకృతిని పలుమార్గాలలో నాశనం చేసే పెద్ద పెద్ద మనుష్యులతో నిండిన లోకంలో—

వంద రూపాయలకోసం తండ్రిని చంపుకొనే కొడుకులుండటంలో ఆశ్చర్యమేముంది?

దేముడా—రక్షించు ఈ ప్రపంచాన్ని—

ప్రకృతిని చంపే ఈ పాపుల్ని—

అతను పెద్దగా అరిచి కిందపడ్డాడు. రక్తం కన్నీరై దారలు కట్టింది. నేలతల్లి అతడిని ఆప్యాయంగా తన కౌగిట్లో చేర్చుకొని సేదతీర్చింది!

